

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఆదివారం 08-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :141 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్



అరచేతిలో ఆర్టీసీ.. అదిరిపోయే అప్‌డేట్!



2 లో

- ఒకే క్యూఆర్‌తో ఆర్టీసీ సేవలు
- స్కాన్ చేస్తే లైవ్ బస్సు ట్రాకింగ్
- ఆన్‌లైన్‌లో టికెట్ రిజర్వేషన్
- బస్సుల వేళలు, రూట్ల వివరాలు
- సోషల్ మీడియా లింకులన్నీ ఒకేచోట
- ఫిర్యాదులు, సూచనలకు ప్రత్యేక సదుపాయం

ఈ20 కాదు.. 420 పెట్రోల్ -రాహుల్ ఫైర్!

- ఈ20 పెట్రోల్‌లో అధిక ఇథనాల్ కల్తీ?
- 14 నమూనాల్లో 11 చోట్ల అధిక శాతం
- 31.2 శాతం ఇథనాల్ ఉన్నట్లు గుర్తింపు
- మోడీ సర్కారుపై రాహుల్ తీవ్ర విమర్శలు
- చమురు సంస్థలపై చర్యలు ఎప్పుడంటూ ప్రశ్న
- ఆరోపణలను ఖండించిన చమురు సంస్థలు
- పెట్రోల్ నాణ్యతపై ప్రమాణాలే ఆధారమన్న సంస్థలు
- పరీక్షల తీరుపై చమురు సంస్థల అభ్యంతరం



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): దేశంలో పెట్రోల్ నాణ్యత, ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియపై రాజకీయ వివాదం మొదలైంది. పెట్రోల్‌లో నిర్ణీత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కర్ణాటకలోని ఏడు జిల్లాల నుంచి సేకరించిన పెట్రోల్ నమూనాలను పరీక్షించగా.. 14 నమూనాల్లో 11 చోట్ల 20 శాతానికి మించి ఇథనాల్ ఉన్నట్లు తేలిందని వెల్లడించారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియా వేదికగా పోస్టు చేస్తూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నది ఈ20 పెట్రోల్ విధానం కాదని 420 విధానం అంటూ సెటైర్ వేశారు.

మోడీజీ ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?

ప్రజల కార్లలోని పెట్రోల్‌ను దోచుకుంటున్నారంటూ కేంద్రంపై ఫైర్ అయ్యారు.

2 లో

రాహుల్ గాంధీని

తెలంగాణలో అడుగు పెట్టనివ్వం

- రాహుల్ పర్యటనను అడ్డుకుంటాం
- హామీలు నెరవేర్చకుండా తెలంగాణకు రావొద్దు
- యువతను, నిరుద్యోగులను మోసం చేశారు
- రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు
- పెట్టుబడులకు బీజేపీ వ్యతిరేకం కాదు
- వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సరికాదు
- దీపావళి తర్వాత బీజేపీ పాదయాత్రలు
- యాత్రల్లో పాల్గొననున్న జాతీయ నేతలు

2 లో



సోనియా జీవితంలోని తెలియని కోణాలు!

- నవంబర్ 10న సోనియా ఆత్మకథ విడుదల
- భారతీయ సంస్కృతికి ఎలా దగ్గరయ్యారంటే..
- రాజీవ్‌తో తొలి తందూరీ చికెన్ అనుభవం
- చీరకట్టుపై ఆసక్తికర విషయాలు
- నెహ్రూ నేసిన చీరతో వివాహం
- ఇందిరాతో పరిచయం.. హిందీ నేర్చుకున్న వైనం
- కుటుంబాన్ని కలచివేసిన వరుస విషాదాలు
- ప్రధాని పదవిని తిరస్కరించిన సందర్భం

2 లో

రాజకీయాల్లోకి ధనుష్.. క్లారిటీ ఇచ్చేశాడు!

- తన వెనుక ఏ పార్టీ లేదన్న నటుడు
- బీజేపీ మద్దతు ప్రచారానికి చెక్
- దేవుడే తనను నడిపిస్తున్నాడని వ్యాఖ్య
- అభిమానులే తనకు అసలైన బలమని వెల్లడి
- తమిళనాట రాజకీయ ప్రవేశంపై చర్చ

2 లో

- 3 వేల మంది న్యాయ సలహాదారుల నియామకానికి ప్లాన్



దీపావళి పర్వదిన సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు కావున రేపటి సంచిక (సోమవారం 09-11-2026) వెలువడదు

పున: దర్శనం తిరిగి మంగళవారం (10-11-2026)

-ఎడిటర్



చీరల పంపిణీకి రంగం సిద్ధం!

- ఈ నెల 19 నుంచి చీరల పంపిణీ
- 95 లక్షల మంది మహిళలకు లబ్ధి
- రూ.334 కోట్లతో పథకం అమలు
- నెక్లెస్ రోడ్డులో సీఎం ప్రారంభం
- చిలకపచ్చ రంగులో కొత్త చీరలు
- సిరిసిల్ల సహా 14 కేంద్రాల్లో తయారీ
- ఇప్పటికే 65 లక్షల చీరలు సిద్ధం
- ఆధార్‌తో లబ్ధిదారుల గుర్తింపు
- వారం రోజుల పాటు పంపిణీ కార్యక్రమం

న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో మహిళలకు తీపి కబురు. ప్రభుత్వం అందించనున్న ఉచిత చీరల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఇందిరా మహిళాశక్తి పథకం కింద ఈ నెల 19న హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు రాజధాని పరిసర ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యురాళ్లు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. 2026 సంవత్సరానికి ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం రూ.334 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 95 లక్షల మంది మహిళలకు చీరలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

మిగతావి 2 లో..

పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ!

- సొంత ఆదాయం నేరుగా ఖాతాల్లోకి
- ఖజానా చుట్టూ తిరిగే పని లేదు
- నిధుల విడుదలలో జాప్యానికి చెక్
- అభివృద్ధి పనులకు తక్షణ నిధులు
- సర్పంచ్‌లకు పెరగనున్న ఆర్థిక స్వేచ్ఛ
- గ్రామీణ మౌలిక వసతులకు ఊతం
- స్థానిక పాలనలో పారదర్శకతకు పెద్దపీట



2 లో

న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): గ్రామ స్థాయి అభివృద్ధికి పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకున్న ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ఖజానా ద్వారా మళ్లించాల్సిన అవసరం లేకుండా, నేరుగా ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు వీలుగా చట్ట సవరణ చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ, తెలంగాణ పంచాయతీ రాజ్ (నాల్గవ సవరణ) చట్టం, 2026ను అక్టోబర్ 9, 2026 నుండి అమలులోకి తెస్తూ జీవో ఎంఎస్ నెం. 43ను జారీ చేసింది.

ఇక ఇంటింటికీ ఇంటర్నెట్!



- భారత్ నెట్‌తో ప్రాజెక్టుకు మార్గం
- తెలంగాణకు రూ.3,185 కోట్ల నిధులు
- కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం
- కొత్తగా రూరల్ ఇంటర్నెట్ కార్పొరేషన్
- టీ-ఫైబర్‌తో ఇంటింటికీ కనెక్టివిటీ

2 లో

కొడంగల్ టెండర్లలో 5 వేల కోట్ల గోల్‌మాల్?

- మంత్రి కంపెనీకే పనులంటూ ఆరోపణలు
- మిగతా సంస్థలన్నీ డమ్మీలేనన్న కేటీఆర్
- 1,450 కోట్ల నుంచి 6,825 కోట్లకు పెంపు
- ఐదు రెట్లు పెరిగిన ప్రాజెక్టు అంచనా వ్యయం
- ప్రజాధనం దోచుకుంటున్నారంటూ విమర్శ
- రాహుల్ గాంధీకి కేటీఆర్ చురకలు



2 లో

న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్ల కేటాయింపు ప్రక్రియలో భారీ ఎత్తున నిధుల దుర్వినియోగం, అంతా ఏకపక్షం జరుగుతోందని ఆరోపించారు. ఈ మేరకు శనివారం కేటీఆర్ సామాజిక మాధ్యమం ట్విట్టర్ వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

మంత్రి సంస్థకే పనులు:

కొడంగల్-నారాయణపేట-మక్తల్ లిఫ్ట్ ఇరిగేషన్ టెండర్లలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీయే దరఖాస్తు చేసుకుందని,

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

ఆదివారం 08-11-2026

రాహుల్ గాంధీని తెలంగాణలో అడుగు పెట్టనివ్వం



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర యువతను, రైతులను కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా మోసం చేశారని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తే ఆయనను తప్పకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే హక్కు లేదని, ఆయన పర్యటనలను అడ్డుకొని తీరతామని హెచ్చరించారు. తాము 'భారత్ సమ్మిట్' నిర్వహణకు వ్యతిరేకం కాదని వెల్లడించారు. తెలంగాణకు కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తే ఎప్పుడైనా స్వాగతిస్తామని స్పష్టం చేశారు.

రైతుల సమస్యల విస్మరణ..

రాష్ట్రంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవాల్సిన బాధ్యతను పక్కనపెట్టి, కాంగ్రెస్ నేతలు ఢిల్లీ కార్యక్రమాల్లో పాల్గొనడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. రైతులకు అవసరమైన సాయం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. 'తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రభుత్వం పదే పదే కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణవ్యాప్తంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం దీపావళి తర్వాత విస్తృత పాదయాత్రలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ పాదయాత్రల ముగింపు లేదా ముఖ్య ఘట్టాలకు బీజేపీ జాతీయ నాయకులు హాజరుకానున్నారని తెలిపారు.

రాజకీయాల్లోకి ధనుష్.. క్లారిటీ ఇచ్చేశాడు!



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): తమిళ సినీ నటుడు ధనుష్ రాజకీయ రంగ ప్రవేశంపై చర్చ గత కొంతకాలంగా జోరందుకుంది. 'తమిళగ ఎళుచ్చి కళగం' పేరుతో ధనుష్ కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఆ పేరును ఎన్నికల సంఘం వద్ద కూడా నమోదు చేయించుకున్నారంటూ వార్తలు వచ్చాయి. అయితే ధనుష్ రాజకీయాల్లోకి రావడానికి బీజేపీ మద్దతు ఉందని, ఆయన్ను వెనుకుండి నడిపిస్తున్నది కమలం పార్టీనే అంటూ జరుగుతున్న ప్రచారంపై తాజాగా ఆయన స్పందించారు. తన వెనక ఏ రాజకీయ పార్టీ లేదని స్పష్టం చేశారు. తన తాజా చిత్రం 'ఓం' ఆడియో విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ధనుష్ ఈ అంశంపై మాట్లాడుతూ తన గురించి అనేక రకాల ప్రచారాలు జరుగుతున్నాయని, కొందరు తన వెనుక ఉన్నారని, మరికొందరు తనకు మద్దతు ఇస్తున్నారని వార్తలు వస్తున్నాయని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. తనకు ఏ వ్యక్తి లేదా సంస్థ ప్రత్యేకంగా మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు.

నన్ను నడిపిస్తున్నది అతడే:

అయితే తనకు దేవుడి ఆశీస్సులు ఉన్నాయని, అభిమానులు తన వెనుక ఉన్నారని, ప్రజలు తనకు అండగా ఉన్నారని ధనుష్ తెలిపారు. దేవుడే తనను నడిపిస్తున్నాడని, అభిమానులు తనకు బలమని స్పష్టం చేశారు. ప్రజలే తనకు అండగా నిలుస్తున్నారని వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రయాణంపై వస్తున్న ఊహాగానాలకు తెరదించకపోయినా, తనకు ఏ రాజకీయ పార్టీ ప్రత్యేక మద్దతు లేదనే విషయాన్ని ఆయన స్పష్టం చేయడం ద్రవిడ పాలిటిక్స్ లో ఆసక్తిని రేపుతోంది. కాగా ప్రజలకు ఎదురయ్యే చట్టపరమైన సమస్యలు, సామాజిక సమస్యలకు న్యాయ సలహాలను అందించేందుకు తమిళనాడు వ్యాప్తంగా 3 వేల మంది న్యాయ సలహాదారులను నియమించాలని, ఇందుకు సంబంధించిన వ్యవస్థను జిల్లాల వారీగా ఏర్పాటు చేయాలని ధనుష్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో సినీ కెరీర్ లో దుమ్ము దులిపిన ధనుష్ భవిష్యత్ లో రాజకీయ రంగంలోనూ రప్ఫాడించబోతున్నారని ఆయన అభిమాను ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కొడంగల్ టెండర్లలో రూ.5 వేల కోట్ల గోల్‌మాల్?

మొదటి పేజీ తరువాయి

పోటీలో ఉన్న మిగిలిన సంస్థలన్నీ కేవలం కాగితాలకే పరిమితమైన "డమ్మీ కంపెనీలు" అని కేటీఆర్ విమర్శించారు. రేసులో ఒక్కరే పరుగెత్తి గెలిచిన చందంగా ఈ టెండర్ల సెటప్ ఉందని ఆరోపించారు. ప్రారంభంలో దాదాపు రూ.1,450 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని ఏకంగా ఐదు రెట్లు పెంచి రూ.6,825 కోట్లకు చేర్చారని దుయ్యబట్టారు. వేల కోట్ల రూపాయల ప్రాజెక్ట్ ఖర్చు పెంపుతో ప్రజాధనాన్ని మళ్లిస్తున్నారే తప్ప, ఇప్పటివరకు ఈ పథకం ద్వారా ప్రజలకు చుక్క నీరు కూడా అందించలేకపోయారని మండిపడ్డారు.

రాహుల్ గాంధీ హెల్ప్ చేయండి..

రాష్ట్రంలో సామాన్య ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూ లైన్లలో నిలబడే పరిస్థితి ఉంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో తెలంగాణ వనరులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ట్యాగ్ చేస్తూ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. క్రోనీ క్యాపిటలిజం, పగటిపూట దోపిడీ, క్లెప్టోక్రసీ (అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయని రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి అంటూ ఎద్దేవా చేశారు.

సోనియా జీవితంలోని తెలియని కోణాలు!



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తన జీవిత విశేషాలతో రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' నవంబర్ 10న విడుదల కానుంది. హార్పర్ కొలిన్స్ ప్రచురిస్తున్న ఈ పుస్తకానికి సంబంధించిన కొన్ని ఆసక్తికర అంశాలను పబ్లిషర్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. మొదట్లో తనకు తెలియని ఒక దేశం, సంస్కృతి మెల్లమెల్లగా తన జీవితంలో భాగమయ్యాయని సోనియా అందులో పేర్కొన్నారు.

తన భర్త రాజీవ్ గాంధీతో కలిసి మొదటిసారి భారతీయ వంటకమైన 'తందూరీ చికెన్' రుచి చూసిన జ్ఞాపకాన్ని ఆమె పంచుకున్నారు. అది బాగా ఎర్రగా ఉండి నోరు మండించిందని, ఆ తర్వాత మెల్లగా థాలీలో వడ్డించే అన్నం, ఫుల్కాలు, కూరలు, అర్హర్ పప్పు, మటన్, చికెన్ వంటకాలకు అలవాటు పడ్డానని తెలిపారు. చీర ప్రపంచంలోనే అత్యంత సుందరమైన దుస్తులలో ఒకటి అని, కానీ మొదట్లో దాన్ని ధరించడం కష్టంగా అనిపించేదని పేర్కొన్నారు. నిశ్చితార్థం వేళ చీర ఊడిపోకుండా ఉండటానికి పలు సేఫ్టీ పిన్నులు వాడాల్సి వచ్చిందని, పెళ్లికి మాత్రం స్వాతంత్ర్య సమరంలో భాగంగా జవహర్‌లాల్ నెహ్రూ జైలులో వడికిన నూలుతో నేసిన చీరను ధరించినట్లు వెల్లడించారు.

కేంబ్రిడ్జ్‌లోని ఒక గ్రీక్ రెస్టారెంట్‌లో రాజీవ్ గాంధీని మొదటిసారి కలిసినప్పుడు ఆయన ఎంతో హుందాగా, శాంత స్వభావుడిగా కనిపించారని సోనియా గుర్తు చేసుకున్నారు. అత్తగారు, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో పరిచయం, భారతదేశంలో స్థిరపడటానికి తాను చేసిన ప్రయత్నాలు, హిందీ నేర్చుకోవడం వంటి విషయాలను పుస్తకంలో వివరించారు. అలాగే సంజయ్ గాంధీ విమాన ప్రమాద మరణం, 1984లో ఇందిరా గాంధీ హత్య, 1991లో రాజీవ్ గాంధీ దారుణ హత్య వంటి విషాద ఘటనలు తమ కుటుంబాన్ని తీవ్రంగా కలచివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం పాటు రాజకీయాలకు దూరంగా ఉండాలని భావించినప్పటికీ, పరిస్థితుల ప్రభావంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎలా రావాల్సి వచ్చిందో ఈ పుస్తకంలో పొందుపరిచారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, ఎంపీగా, యూపీఏ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె.. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి విజయం సాధించిన వేళ ప్రధాని పదవిని నిరాకరించి, పదేళ్ల పాటు యూపీఏ కూటమికి మార్గదర్శకత్వం వహించిన రాజకీయ పరిణామాలను సమగ్రంగా వివరించారు.

అరచేతిలో ఆర్టీసీ.. అదిరిపోయే అప్‌డేట్!



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు మరింత మెరుగైన, ఆధునిక సేవలు అందించేందుకు సరికొత్త డిజిటలైజేషన్‌తో ముందుకు వచ్చింది. 'ప్రగతి రథం – ప్రజా సేవా పథం' ధ్యేయంగా పనిచేస్తున్న ఆర్టీసీ, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తన సేవలను ప్రయాణికుల అరచేతిలోకి తీసుకొచ్చింది. స్మార్ట్‌ఫోన్ వాడకం బాగా పెరిగిన నేటి కాలంలో.. ఒకే ఒక్క క్యూఆర్ కోడ్ ద్వారా ఆర్టీసీకి చెందిన అన్ని సేవలను ఒకే చోట పొందే ప్రత్యేక సదుపాయాన్ని రూపొందించింది. ఇంతకుముందు ఉన్న క్యూఆర్ కోడ్ విధానాన్ని సరికొత్త రీతిలో ఆధునీకరించి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ క్యూఆర్ కోడ్‌ను మొబైల్ కెమెరాతో స్కాన్ చేయగానే, ఆర్టీసీకి సంబంధించిన వివిధ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, అప్లికేషన్ల లింక్‌లు స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతాయి.

ఒకే స్కాన్‌తో లభించే సేవలు ఏంటంటే..?

మొదటిది బస్సుల ప్రత్యక్ష ట్రాకింగ్. యాప్ ద్వారా బస్సులు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయో లైవ్ లొకేషన్ తెలుసుకోవచ్చు. ఊళ్ల నుంచి లేదా సుదూర ప్రాంతాల నుండి వచ్చే బంధువులు, మిత్రులు ఏ సమయానికి గమ్యస్థానానికి చేరుకుంటారో కచ్చితంగా అంచనా వేయవచ్చు. రెండవది డిజిటల్ టికెట్ రిజర్వేషన్. ఆర్టీసీ అధికారిక బుకింగ్ యాప్ ద్వారా ముందస్తుగా ప్రయాణించాల్సిన బస్సుల్లో టికెట్లను సులభంగా రిజర్వ్ చేసుకోవచ్చు. మూడోది సమగ్ర బస్సుల వివరాలు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూట్లలో నడిచే బస్సుల వేళలు, సర్వీసు రకాలు (ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్‌లగ్జరీ తదితరాలు), రూట్ మ్యాప్‌లను పరిశీలించవచ్చు. నాలుగోది అధికారిక సోషల్ మీడియా కనెక్టివిటీ ఆర్టీసీ ఎప్పటికప్పుడు ప్రకటించే సమాచారం, హెచ్చరికలు తెలుసుకునేందుకు వారి ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్ ఛానళ్లను ఒకే క్లిక్‌తో ఓపెన్ చేయవచ్చు.

అభిప్రాయాలు, ఫిర్యాదులూ అక్కడే..

ఈ వ్యవస్థ ద్వారా సంస్థ పనితీరును మరింత మెరుగుపరచడానికి ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను అందించవచ్చు. ప్రయాణంలో ఎదురయ్యే ఇబ్బందులపై ఫిర్యాదులు చేసేందుకు కూడా సోషల్ మీడియా లింక్‌లు ఉపయోగపడతాయి. వినియోగదారులు తమ ఈ-మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్‌తో ఒకసారి ఖాతా తెరుచుకుంటే, ఈ సేవలన్నింటినీ నిరంతరం పొందే అవకాశం ఉంటుంది. ఆర్టీసీ ప్రవేశపెట్టిన ఈ క్యూఆర్ కోడ్ విధానం వల్ల క్యూలైన్లలో నిలబడే అవసరం తప్పడమే కాకుండా, ప్రయాణ సమయం ఆదా అవుతోందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇక ఇంటింటికీ ఇంటర్నెట్!

న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటా వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మార్గం సుగమమైంది. కేంద్ర ప్రభుత్వపు అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్ కింద తెలంగాణ రాష్ట్రంలో రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేసేందుకు కేంద్రంతో ఒప్పందం పూర్తయింది. ఢిల్లీలోని సంచార్ భవన్‌లో జరిగిన తొలి బోర్డు సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐఏఎస్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

రూ. 3,185 కోట్ల కేంద్ర నిధులు..

ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి రూ. 3,185 కోట్ల భారీ నిధులు సమకూరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'తెలంగాణ రాష్ట్ర రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్' ను ఏర్పాటు చేయనున్నారు. టీ-ఫైబర్ ఎండీ పన్నీరు వేణు ప్రసాద్ ఈ కొత్త కార్పొరేషన్‌కు సీఈఓగా వ్యవహరించనున్నారు. టీ-ఫైబర్, కొత్త కార్పొరేషన్ సంయుక్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించనున్నాయి. ఈ సమావేశానికి వర్చువల్ విధానంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు. సంచార్ భవన్‌లో జరిగిన నేరుగా జరిగిన కార్యక్రమంలో డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ ఫైబర్ ఎండీ ఉ సీఈఓ పన్నీరు వేణు ప్రసాద్, బీఎస్ఎన్ఎల్ఎ డైరెక్టర్ పాపా సుధాకర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ!

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి.

నిధుల విడుదలలో జాప్యానికి చెక్

గతంలో గ్రామ పంచాయతీలు వివిధ మార్గాల ద్వారా సమకూర్చుకున్న సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేసి, ఆ తర్వాత నిధులను పొందాల్సి వచ్చేది. ఈ సంక్లిష్టమైన విధానం వల్ల గ్రామాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడంలో తీవ్రమైన జాప్యం జరిగేది. ఫలితంగా పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రహదారుల మరమ్మతులు వంటి ప్రాథమిక అవసరాలను తీర్చడంలో గ్రామ పంచాయతీలు తరచూ ఇబ్బందులను ఎదుర్కొనేవి. స్థానిక సంస్థల ఆర్థిక స్వయంప్రతిపత్తికి ఈ విధానం కొంత అడ్డంకిగా మారడంతో, ప్రభుత్వం ఈ శాసన సవరణను తీసుకువచ్చింది.

వేగవంతం కానున్న స్థానిక అభివృద్ధి పనులు

ఇప్పుడు కొత్త నిబంధనల ప్రకారం నిధులు నేరుగా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతుండటంతో, స్థానిక సర్పంచ్‌లు లేదా పాలకవర్గాలు ఆ ఆదాయాన్ని ఎవరి అనుమతి కోసం ఎదురుచూడకుండా తక్షణమే వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. ప్రజల తక్షణ స్థానిక అవసరాలను ఇట్టే తీర్చడానికి ఈ సంస్కరణ ఎంతగానో దోహదపడుతుందని అధికారులు తెలిపారు. నిధుల కొరత లేదా సాంకేతిక జాప్యం లేకుండా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి ప్రాజెక్టులు శరవేగంగా ముందుకు సాగనున్నాయి. ఈ నిర్ణయంతో గ్రామ పంచాయతీలు ఆర్థికంగా మరింత పటిష్టంగా మారడంతో పాటు, పాలనలో పారదర్శకత పెరుగుతుందని భావిస్తున్నారు.

నామినేటెడ్ పోస్టులపై గుడ్‌న్యూస్!



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగంగా జరుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవులను కూడా త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తేలిపారు. చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవుల భర్తీకి సంబంధించి ప్రస్తుతం తీవ్ర కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీలో ప్రస్తుత పరిస్థితులు, పరిణామాలపై పూర్తి వివరాలను సేకరించి అధిష్టానానికి నివేదిక అందజేసినట్లు ఆయన తెలిపారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు..

ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఏఐసీసీ నిఘా – పనితీరు ఆధారంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గతంలో ఉన్నట్లు లేదని, నాయకులు, మంత్రుల పనితీరును పర్యవేక్షించడానికి ఏఐసీసీ స్థాయిలో పెద్ద వ్యవస్థే పని చేస్తోందని తెలిపారు. కనీసం మూడు రోజులు పార్టీ కార్యక్రమాల నివేదిక ఢిల్లీకి వెళ్లకుంటే వెంటనే అక్కడి నుంచి మెసేజ్ వస్తుందని ఆయన పేర్కొన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఇతర నాయకులందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తున్నారని మహేష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

కవిత డిమాండ్‌కు సర్కార్ తలొగ్గిందా?



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ రక్షణ సేన డిమాండుకు తలొగ్గే ప్రభుత్వం ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్సీ, ఎస్టీ కమిషన్లను కలిపి ఒకే కమిషన్‌గా ఏర్పాటు చేయడంతో అటు ఎస్సీలకు, ఇటు ఎస్టీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు తాము ప్రస్తావించామని గుర్తుచేశారు. సమాజంలో ఎస్సీలు, ఎస్టీలు ఎదుర్కొంటున్న సామాజిక, భౌగోళిక సమస్యలు పూర్తిగా వేర్వేరుగా ఉన్నాయని పేర్కొన్నారు. నేటికీ ఎస్సీలు సమాజంలో పీడన, అణచివేత, దౌర్జన్యాలను ఎదుర్కొంటుంటే, మరోవైపు ఆదివాసీలను రకరకాల పేర్లతో అడవి నుంచి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. గిరిజనులు తమ అస్తిత్వమైన జల్–జంగల్–జమీన్‌పై హక్కులను కోల్పోయే ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఆదివాసీలు, గిరిజన సమాజం అభ్యున్నతి కోసం ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం వారికి మంచి చేస్తుందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఎస్టీ కమిషన్ గిరిజనుల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాలని.. వారి ఆత్మగౌరవాన్ని, విశిష్టమైన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించేలా పనిచేయాలని ఆకాంక్షించారు.

ఈ20 కాదు.. 420 పెట్రోల్: రాహుల్ ఫైర్!

మొదటి పేజీ తరువాయి

ఈ పరిణామాలపై ప్రధాని మోడీని ఉద్దేశించి రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు. పెట్రోల్‌లో వాస్తవంగా ఎంత శాతం ఇథనాల్ కలుపుతున్నారు? 20 శాతానికి మించి ఇథనాల్ కలిపిన సంస్థలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు? ప్రభుత్వ విధానాల వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతోందని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వ ఇథనాల్ మిశ్రమ విధానంపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

31 శాతానికి పైగా ఇథనాల్!

కాగా కర్ణాటకలోని బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపూర్, బెంగళూరు రూరల్, రామనగర, మంగళూరు, తుమకూరు జిల్లాల నుంచి నమూనాలను పరిశీలించగా పెట్రోల్‌లో 26 నుంచి 31 శాతం వరకు ఇథనాల్ తెలిసిందంటూ కర్ణాటక ప్రభుత్వం ప్రకటన చేసింది. ఈ పరీక్షల వివరాలను రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పోస్టు చేస్తూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు గుర్తించారు. భారత్ పెట్రోలియం, నయారా ఎనర్జీ, షెల్ సంస్థలకు చెందిన పెట్రోల్ నమూనాల్లోనూ 20 శాతానికి మించి ఇథనాల్ ఉన్నట్లు ఆరోపించారు. మొదట ఈ నమూనాలను ఐఓసీఎల్, బీపీసీఎల్ సంస్థల సొంత ప్రయోగశాలలకు పంపగా.. వాటి నివేదికల్లో ఇథనాల్ శాతాన్ని వెల్లడించలేదని రాహుల్ విమర్శించారు. దీంతో స్వతంత్ర ప్రయోగశాలల్లో పరీక్షలు చేయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

ఆరోపణలను ఖండించిన చమురు సంస్థలు:

కర్ణాటక ప్రభుత్వం వెల్లడించిన పరీక్షా ఫలితాలపై ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ అభ్యంతరం వ్యక్తం చేశాయి. దేశవ్యాప్తంగా, కర్ణాటకలోనూ సరఫరా చేస్తున్న ఈ20 పెట్రోల్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిర్దేశించిన ఐఎస్ 17021 ప్రమాణాలకు అనుగుణంగానే ఉందని సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశాయి. 2026 అక్టోబర్‌లో నిర్వహించిన నమూనాల సేకరణ ప్రక్రియపై కూడా సంస్థలు ప్రశ్నలు లేవనెత్తాయి. నమూనాల సేకరణ సమయంలో తమ ప్రతినిధులు పాల్గొనలేదని, పరీక్షల కోసం తీసుకున్న నమూనాల్లో కొంత భాగాన్ని తిరిగి భద్రపరచిన వివరాలు, పెట్రోల్ బంకుల వారీగా పూర్తి వివరాలు, సమగ్ర ల్యాబ్ నివేదికలు తమకు అందలేదని తెలిపాయి. కర్ణాటక ప్రభుత్వం ప్రస్తావించిన థర్డ్ పార్టీ ల్యాబ్ నివేదికల్లో ఇథనాల్ శాతాన్ని నిర్ధారించేందుకు అవసరమైన సాంకేతిక వివరాలు లేవని పేర్కొన్నాయి. సరైన పత్రాలు, నమూనాలు లేకుండా పరీక్షా ఫలితాలను స్వతంత్రంగా ధ్రువీకరించడం సాధ్యం కాదని స్పష్టం చేశాయి.

చీరల పంపిణీకి రంగం సిద్ధం!

మొదటి పేజీ తరువాయి

ఈసారి మహిళలకు అందించే చీరల రంగులోనూ ప్రభుత్వం మార్పు చేసింది. గతంలో పాలపిట్ట రంగు చీరలను పంపిణీ చేయగా.. ఈ ఏడాది ఎరుపు రంగు జరీ అంచుతో కూడిన చిలకపచ్చ రంగు చీరలను ఎంపిక చేసింది. చేనేత, వస్త్ర పరిశ్రమకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు మహిళలకు నాణ్యమైన చీరలు అందించాలనే ఉద్దేశంతో ఏప్రిల్ నుంచే ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభించారు. సిరిసిల్లతో పాటు రాష్ట్రంలోని మరో 13 కేంద్రాల్లో చీరల తయారీ చేపట్టారు. మొత్తం 95 లక్షల చీరలు సిద్ధం చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు సుమారు 65 లక్షల చీరల ఉత్పత్తి పూర్తయింది. వీటిని ఇప్పటికే వివిధ జిల్లాలకు తరలించారు. దాదాపు రెండు నెలల క్రితమే సగానికి పైగా చీరలు సిద్ధమైనప్పటికీ, దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబరు 19న పంపిణీ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనకు గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ఆమోదం తెలిపింది.

చీరల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించింది. తెల్ల రేషన్‌కార్డులు కలిగిన కుటుంబాలకు చెందిన మహిళలకు వారం రోజుల పాటు చీరలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల్లో లేదా నిర్దేశిత ప్రాంతాల్లో మహిళలు తమ ఆధార్ కార్డులను సంబంధిత పంచాయతీ అధికారులకు చూపించాల్సి ఉంటుంది. అధికారులు యాప్ ద్వారా లబ్ధిదారుల ఫొటోలను తీసి, ఆధార్ తదితర వివరాలను ధ్రువీకరించిన అనంతరం చీరలను అందజేస్తారు. ఒకే లబ్ధిదారుకు రెండుసార్లు చీరలు అందకుండా.. అర్హులైన ప్రతి మహిళకు ప్రయోజనం చేకూరేలా ఈ డిజిటల్ విధానాన్ని అమలు చేయనున్నారు. పంపిణీ బాధ్యతలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందితో పాటు సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం అప్పగించింది. 95 లక్షల మంది మహిళలకు నిర్దిష్ట గడువులోగా చీరలు చేరేలా జిల్లాల వారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పాకాల సరస్సులో తీవ్ర విషాదం..

ఇద్దరు చిన్నారులతో కలిసి తల్లి మృతి!



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (ఇది కద నిజం): వరంగల్ జిల్లాలోని పాకాల సరస్సులో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులతో కలిసి సరస్సులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే గీసుకొండ మండలం ఎలుకుర్తి హవేలీ గ్రామానికి చెందిన మమత అదే గ్రామానికి చెందిన ఈరెల్లి సుమన్‌ను కులాంతర వివాహం చేసుకున్నట్లు సమాచారం. వీరికి ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. అయితే కొంతకాలంగా భర్త సుమన్ మరో మహిళతో వివాహేతర సంబం

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 08-11-2026

ప్రపంచ చరిత్రలో అక్టోబర్ విప్లవం స్ఫూర్తిదాయకం

● కమ్యూనిస్టుల ఐక్యతతోనే దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం -- ఎంసిపిఐ(యు) నేతలు

వరంగల్, నవంబర్ 7 (ఇది కద నిజం)

ప్రపంచ చరిత్రలో రష్యన్ అక్టోబర్ విప్లవం ఎంతో స్ఫూర్తిదాయకమని, బూర్జువా, భూస్వామ్య, పెట్టుబడిదారీ దోపిడీ విధానాలకు ప్రత్యామ్నాయంగా సమసమాజ స్థాపనను ఆచరణలో నిరూపించిన చారిత్రక ఘట్టమని ఎంసిపిఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు సింగతి సాంబయ్య, వరంగల్ నగర కార్యదర్శి మాలోతు సాగర్ అన్నారు. అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో కమ్యూనిస్టుల ఐక్యత మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు.రష్యన్ అక్టోబర్ విప్లవం 109వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఎంసిపిఐ(యు) వరంగల్ నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం వరంగల్‌లోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.సామ్రాజ్యవాదం, యుద్ధోన్మాదం, మతోన్మాదం, ఫాసిజానికి వ్యతిరేకంగా కామ్రేడ్ ఎం. ప్రత్యూష అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సింగతి సాంబయ్య, మాలోతు సాగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామ్రాజ్యవాద దోపిడీ విధానాలు, నిరంకుశ, నియంతృత్వ పాలనలకు ప్రత్యామ్నాయంగా కార్మిక రాజ్యాన్ని స్థాపించి శ్రామిక వర్గానికి అండగా నిలిచిన రష్యన్ విప్లవం ప్రపంచ మానవాళికి నూతన దిశానిర్దేశం చేసిందన్నారు. సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే భూ పంపిణీ, కార్మిక హక్కులు, మహిళా హక్కులకు ప్రాధాన్యతనిస్తూ సంపద అందరికీ సమానంగా దక్కాలనే లక్ష్యంతో సమసమాజ స్థాపన దిశగా అడుగులు వేసిందని పేర్కొన్నారు.ప్రపంచ చరిత్రలో రష్యన్ విప్లవం ఒక వేగుచుక్కగా నిలిచిందన్నారు.వివిధ ప్రాంతాలుగా విడిపోయి ఉన్న రష్యాను ఐక్యం చేసి, శాంతి స్థాపనకు కృషి చేస్తూ సోషలిస్టు రష్యా నిర్మాణానికి బాటలు వేసిందని వివరించారు.నేడు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సామ్రాజ్యవాదం, నియంతృత్వం, మతోన్మాదం, దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా శ్రామిక వర్గమంతా ఐక్యంగా ఎర్రజెండా పట్టుకొని పోరాటాలు సాగించాల్సిన అవసరం ఉందన్నారు.దేశంలో పెట్టుబడిదారీ, మతోన్మాద, దోపిడీ పాలక విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాస్వామిక, సామాజిక శక్తులు ఐక్యంగా నిలబడి ప్రజలకు ప్రత్యామ్నాయ పాలన అందించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ లక్ష్యంతో ఎంసిపిఐ(యు) నిరంతరం ప్రయత్నిస్తోందని తెలిపారు. వివిధ దారుల్లో, వేర్వేరు పార్టీలుగా చీలిపోయిన కమ్యూనిస్టులంతా ఐక్యమై ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలు నిర్వహించాలని వారు కోరారు.ఈ సమావేశంలో పార్టీ నగర ఏరియా కార్యదర్శులు గణేపాక ఓదేలు, ఐత నగేష్, నగర నాయకులు అప్పనపూరి నర్సయ్య, దసరాపు అనిల్, దామెర రమేష్ తదితరులతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ధర్మసాగర్ విద్యార్థికి స్వర్ణ పతకం

● జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించనున్న ప్రభుదేవ్

ధర్మసాగర్ నవంబర్ 07 (ఇది కద నిజం)

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి గంగారపు ప్రభుదేవ్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటుకున్నాడు.ఖమ్మంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు.కళాశాలలో సీఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ప్రభుదేవ్ సాధించిన ఈ విజయం కళాశాలకు గర్వకారణంగా నిలిచింది.రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన ప్రభుదేవ్ నవంబర్ 11వ తేదీన మధ్యప్రదేశ్‌లో జరగనున్న ఎస్‌జీఎఫ్ఐ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు.జాతీయస్థాయిలో 400 మీటర్ల పరుగు పందెంతో పాటు 400 మీటర్ల రిలే విభాగంలోనూ తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు.ఈ సందర్భంగా ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, అధ్యాపక బృందం ప్రభుదేవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.జాతీయస్థాయి పోటీల్లోనూ ఇదే ప్రతిభను కొనసాగించి విజయం సాధించాలని, కళాశాలతో పాటు తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు కేవలం మానసిక, శారీరక ఉల్లాసానికే పరిమితం కావని, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్తు నిర్మాణానికి, కెరీర్ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.క్రీడారంగంలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రత్యేక అవకాశాలతో పాటు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని దేశ ప్రతిష్ఠను పెంపొందించే అవకాశం క్రీడల ద్వారా కలుగుతుందని వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రభుదేవ్ తండ్రి గంగారపు శ్రీనివాస్‌తో పాటు కళాశాల అధ్యాపకులు ప్రభాకర్, వెంకట్, గణేష్, సదానందం, రవళి, వేణు, చంద్రమౌళి తదితరులు పాల్గొని ప్రభుదేవ్‌ను అభినందించారు.



గ్రామాభివృద్ధే ధ్యేయం.. ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత

8వ వార్డులో మురుగు కాలువపై స్లాబ్ నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ కుల్ల మోహన్ రావు

జఫర్‌గఢ్ నవంబర్ 07 (ఇది కద నిజం)

గ్రామ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం అంకితభావంతో పనిచేస్తోందని జఫర్‌గఢ్ గ్రామ సర్పంచ్ కుల్ల మోహన్ రావు అన్నారు.గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రాధాన్యంగా పెట్టుకొని అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు తెలిపారు.శనివారం మండల కేంద్రంలోని 8వ వార్డులో గ్రామపంచాయతీ నిధుల ద్వారా మంజూరైన మురుగు కాలువపై స్లాబ్ నిర్మాణ పనులను సర్పంచ్ కుల్ల మోహన్ రావు, ఉప సర్పంచ్ కోత్వాల కుమార్, 8వ వార్డు సభ్యురాలు రోడ్డ మమతా రాజుతో కలిసి పూజలు నిర్వహించి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. చాలా కాలంగా మురుగు కాలువపై స్లాబ్ లేకపోవడంతో వార్డు ప్రజలు, పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దోమల బెడద, దుర్వాసన వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టినట్లు వివరించారు.ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు.గ్రామంలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపట్టి జఫర్‌గఢ్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు.గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని, మురుగు కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు జ్యోతి యాకయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కుక్కల సారంగం, కాంగ్రెస్ నాయకులు ఉల్లి శివరాజు, వార్డు సభ్యుడు కుక్కల రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి దినేష్, బిల్ కలెక్టర్ బాలరాజ్, గ్రామ పెద్దలు తిప్పరబోయిన కృష్ణ, మెరుగు రాజు, సమ్మయ్య, వార్డు ప్రజలు, గ్రామ ప్రముఖులు, యువకులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ నేత మేకల రవి కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించాలి: గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి

వరంగల్ నవంబర్ 07 (ఇది కద నిజం)

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, శివనగర్‌కు చెందిన మేకల రవి కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి డిమాండ్ చేశారు.ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుని రవి కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.మేకల రవి విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారని రాజనాల శ్రీహరి పేర్కొన్నారు.సీపీఐ విద్యార్థి విభాగం నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించడంతో పాటు, మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించి బాధిత ప్రజల పక్షాన నిలిచారని గుర్తుచేశారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ మేకల రవి కీలక పాత్ర పోషించారని, ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న క్రమంలో అనేకసార్లు జైలు జీవితాన్ని కూడా అనుభవించారని తెలిపారు. ఆయన తల్లిదండ్రులు సైతం గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్లుగా ప్రజాసేవలో పాల్గొన్నారని, ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేశారని వివరించారు.సీపీఐ పార్టీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల పొత్తులో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం మేకల రవి కీలకంగా పనిచేశారని రాజనాల శ్రీహరి పేర్కొన్నారు.రాజకీయ, ప్రజా ఉద్యమాల కోసం జీవితంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆయన కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.మేకల రవికి భార్యతో పాటు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని, కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడిన వ్యక్తి కుటుంబం ఇబ్బందుల్లో ఉన్న సమయంలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలించి, మేకల రవి కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రాజనాల శ్రీహరి డిమాండ్ చేశారు.



ఎస్టీ కమిషన్ ఏర్పాటు ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కీలక ముందడుగు

- కమిషన్ చైర్మన్ పదవి ఆదివాసులకే కేటాయించాలి
- ఆదివాసీ నవనిర్మాణ సేన మండల కార్యదర్శి తల్లడి ప్రసాద్ డిమాండ్

ఇది కద నిజం వాజేడు, నవంబర్ 07:



తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని, ఇది రాష్ట్రంలోని ఆదివాసీ గిరిజన ప్రజల హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయ సాధనకు కీలక ముందడుగు కావాలని ఆదివాసీ నవనిర్మాణ సేన మండల కార్యదర్శి తల్లడి ప్రసాద్ అన్నారు. అయితే ఎస్టీ కమిషన్ ఏర్పాటు లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరాలంటే కమిషన్ చైర్మన్ పదవిని ఆదివాసీ తెగలకు చెందిన అర్హత, సామర్థ్యం, సామాజిక నిబద్ధత కలిగిన వ్యక్తికే కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న భూమి సమస్యలు, పోడు భూముల వివాదాలు, విద్యా, వైద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకబాటుతనం, అటవీ హక్కుల అమలు, రాజ్యాంగబద్ధమైన హక్కుల ఉల్లంఘన వంటి సమస్యలపై ఎస్టీ కమిషన్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలు, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా పర్యవేక్షించి, బాధిత ఆదివాసీలకు న్యాయం జరిగేలా కమిషన్ పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో రాజ్యాంగ నిబంధనల అమలు, పెసా చట్టం, 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టం అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఆదివాసీల భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం, అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, వివక్ష, దోపిడీ, అన్యాయాలపై విచారణ జరిపించాలని కోరారు. ఆదివాసీ సమాజ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, భౌగోళిక పరిస్థితులు, చారిత్రక నేపథ్యం, రాజ్యాంగపరమైన హక్కులపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తి మాత్రమే వారి సమస్యలను సమర్థవంతంగా అర్థం చేసుకుని పరిష్కార దిశగా పనిచేయగలరని పేర్కొన్నారు. అందుకే ఆదివాసీల కోసం ఏర్పాటు చేస్తున్న కమిషన్‌కు ఆదివాసీలే నాయకత్వం వహించడం న్యాయసమ్మతమని స్పష్టం చేశారు. కమిషన్‌లో ఆదివాసీ మేధావులు, విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, సామాజిక ఉద్యమకారులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఎస్టీ కమిషన్ కేవలం ఒక పరిపాలనా వ్యవస్థగా మిగిలిపోకుండా ఆదివాసీ ప్రజల గొంతుకగా, వారి హక్కులకు రక్షణ కవచంగా నిలవాలని ఆకాంక్షించారు. ఎస్టీ కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం.. కానీ చైర్మన్ పదవి ఆదివాసులకే కేటాయించాలి. ఆదివాసుల సమస్యలను అర్థం చేసుకునే వారికే నాయకత్వ బాధ్యతలు అప్పగించినప్పుడే కమిషన్ ఏర్పాటు లక్ష్యం నెరవేరి నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తల్లడి ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు.

పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి

- విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యం: మండల విద్యాధికారి గడ్డి శ్రీనివాస్

ఇది కద నిజం తాడ్వాయి, నవంబర్ 7:



పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని మండల విద్యాధికారి గడ్డి శ్రీనివాస్ సూచించారు. తాడ్వాయి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలలోనే గడుపుతున్నందున వారి అభ్యసన సామర్థ్యాలను గుర్తించి, పాఠ్యాంశాల్లో ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై మరింత దృష్టి సారించి, ప్రత్యేక బోధన ద్వారా విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. ఉపాధ్యాయుల సమష్టి కృషితో పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రేణుక, ఉపాధ్యాయులు సుహాసిని, సరోజిని, లక్ష్మి, ఉషారాణి, వినోద, నారాయణ, వెంకన్న, మమత, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు ప్రజలు ఏమి పాపం చేశారు : మునుగోడు ఎమ్మెల్యే

మునుగోడు,ఇది కద నిజం : ప్రపంచంలోనే అత్యధికంగా ఫ్లోరైడ్‌తో బాధపడుతూ, అన్ని రంగాల్లో అత్యంత వెనుకబడిన మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న తపనతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దగ్గరకు చాలాసార్లు వెళ్లానని, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, మునుగోడు ప్రజలు ఏమి పాపం చేశారని, మాకెందుకు నిధులు ఇవ్వడం లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని పీఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.



9 వేల కోట్ల నిధులతో కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, తాను కొడంగల్ అభివృద్ధి పనులు ఇవ్వొద్దనడం లేదని, కొడంగల్ నియోజకవర్గం లాగానే మునుగోడుతో పాటు వెనుకబడిన నియోజకవర్గాలను గుర్తించి, ఆ నియోజకవర్గాలకు న్యాయం చేయాలని కోరుతున్నానన్నారు. నీకు అదృష్టం కలిసి వచ్చి ముఖ్యమంత్రి అయ్యావు.. దానిని నేను తప్పు పట్టడం లేదన్నారు. నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు రెడ్లు ఉన్నారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా బీసీలకు ఇవ్వాలని కోరినా తన మాట వినకుండా, సూర్యాపేట ఎమ్మెల్యే కావాలనుకున్న వ్యక్తికి ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చారన్నారు. తాను ఎవరికీ భయపడనని, ఎందుకంటే తాను ధర్మం వైపు ఉంటానన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మునుగోడుకు నిధులు కేటాయించాలన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 08-11-2026



సినిమా న్యూస్



ప్రైవసీతో ఆటలొద్దు



టాలీవుడ్‌లో తనదైన వైవిధ్యమైన నటనతో, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనదైన ముద్ర వేసుకున్న నటి సురేఖావాణి ప్రస్తుతం సైబర్ కేటుగాళ్ల బారిన పడ్డారు. కొందరు కేటుగాళ్లు ఆమెను టార్గెట్ చేస్తూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని దుర్వినియోగం చేసి ఆమెకు సంబంధించిన మార్ఫింగ్ వీడియోలను నెట్టింట షేర్ చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. ఈ విషయంపై తీవ్ర మనస్తాపానికి గురైన సురేఖావాణి, సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ సైబర్ నేరస్థులకు, అలాంటి వీడియోలను షేర్ చేసేవారికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్ అయిందని, తన అనుమతి అసలు లేకుండానే తన వ్యక్తిగత, ప్రైవేట్ కంటెంట్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని సురేఖావాణి ఆవేదన వ్యక్తం చేశారు.

దయచేసి ఆ వీడియోలను ఎవరూ షేర్ చేయవద్దని ఆమె మీమ్ పేజీలు, మీడియా మిత్రులు అలాగే ప్రెస్ సభ్యులను కోరారు. ఒకవేళ ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ఆ ఫేక్ కంటెంట్‌ను షేర్ చేస్తే మాత్రం, వాళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటానని ఆమె స్పష్టం చేశారు. ఎవరి వ్యక్తిగత జీవితాన్ని, ఈ కష్టకాలపు పరిస్థితిని వ్యూస్ కోసమో, రీచ్ కోసమో, పబ్లిసిటీ కోసమో అస్సలు ఉపయోగించుకోవద్దని అన్నారు. ప్రతీ ఒక్కరూ తన గోప్యతను గౌరవించాలని, ఇది తన జీవితానికి సంబంధించిన చాలా సీరియస్ మ్యాటర్ అని సురేఖావాణి ఎమోషనల్ అయ్యారు. సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ జరుగుతున్న ఇలాంటి సైబర్ నేరాలపై నెటిజన్లు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'సండియార్'గా కమల్ విధ్వంసం!



లోకనాయకుడు కమల్ హాసన్ స్క్రీన్‌పై కనిపిస్తే ఆ ఇంపాక్ట్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పాత్ర ఏదైనా సరే అందులోకి పరకాయ ప్రవేశం చేసే యూనివర్సల్ హీరో తాజాగా రిలీజైన తన కొత్త సినిమా ఫస్ట్ లుక్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. 'సేతుపతి', 'చిత్తా' లాంటి పవర్ ఫుల్ ఎమోషనల్ హిట్లను తీసిన డైరెక్టర్ ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వంలో కమల్ హాసన్ నటిస్తున్న ప్రాజెక్ట్‌కు 'సండియార్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ అదిరిపోయే ఫస్ట్ లుక్ పోస్టర్‌ను బయటకు వదిలారు.

ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కమల్ హాసన్ లుక్ చూస్తే రోమాలు నిక్కబొడుచుకోవాల్సిందే. సాల్ట్ అండ్ పెప్పర్ గడ్డం, ట్రిమ్ చేసిన హెయిర్, డార్క్ బ్రౌన్ షర్ట్ వేసుకుని చాలా రఫ్ అండ్ రా అవతారంలో దర్శనమిచ్చారు. పాతకాలపు కారు డోర్ మీద చేయి పెట్టి, రివాల్వర్‌ను పట్టుకుని ఆయన తీక్షణమైన చూపులు థియేటర్లలో విధ్వంసం ఖాయమని చెప్పకనే చెబుతున్నాయి. దీనికితోడు కారు డోర్‌పై నుంచి కారుతున్న రక్తపు మరకలు సినిమా ఏ రేంజ్ రా యాక్షన్‌తో సాగనుందో క్లారిటీ ఇచ్చేస్తున్నాయి. 'సండియార్' అంటే దేనికీ వెరవని, ఎవరికీ తలవంచని మొండి ధైర్యం కలవాడని అర్థం. ఆ టైటిల్‌కు తగ్గట్టే కమల్ బాడీ లాంగ్వేజ్ భీకరంగా కనిపిస్తోంది. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ బాణీలు సమకూరుస్తున్నారు. ప్రశాంతంగా కనిపిస్తూనే లోపల అగ్నిపర్వతంలా రగిలిపోయే 'సండియార్' పాత్రతో కమల్ హాసన్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులను తిరగరాస్తారో చూడాలి.

తమిళ ఎంట్రీకి సిద్ధం



పెళ్లిచూపులు, ఈ నగరానికి ఏమైంది వంటి చిత్రాలతో దర్శకుడిగా సత్తా చాటారు తరుణ్‌భాస్కర్. మరోవైపు నటుడిగా కూడా తనదైన ముద్రను వేస్తున్నారు. తాజాగా ఆయన తమిళ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న ఓ తమిళ చిత్రంలో తరుణ్‌భాస్కర్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారు.

ఈ విషయాన్ని ఆయన స్వయంగా వెల్లడించారు. వాస్తవానికి ఈ సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం దర్శకుడు, నటుడు అశ్వత్ మారిముత్తును ఎంపిక చేశారు. అయితే ఆయన ప్రస్తుతం రజనీకాంత్‌తో 'ధర్మన్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. దీంతో పాటు ఇతర ప్రాజెక్ట్స్‌లతో బిజీగా ఉండటం వల్ల డేట్స్ సమస్యలు ఎదురయ్యాయని తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో తరుణ్‌భాస్కర్‌ను తీసుకున్నట్లు తెలిసింది. ఈ చిత్రంలో ప్రదీప్‌రంగనాథన్ సరసన మమితాబైజు కథానాయికగా నటించనుంది.

'ఛత్రి' ఫస్ట్ లుక్ అదుర్స్!

'మాంగళ్యం', 'పరాక్రమం', 'నిర్భంధం' వంటి వైవిధ్యమైన చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సరోజ్ కుమార్, తాజాగా మరో కొత్త చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఛత్రి'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాకి సంబంధించి అన్ని ప్రధాన విభాగాలను సరోజ్ కుమార్ తానే స్వయంగా చూడడం విశేషం. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, ఎడిటింగ్, సంగీతం మరియు దర్శకత్వం వంటి సమస్త బాధ్యతలను ఆయనే నిర్వర్తించారు. బిఎస్కే మెయిన్ స్ట్రీమ్ బ్యానర్‌పై సరోజ్, ప్రమోద్ పడమటి, పృథ్వీ చౌహాన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో సరోజ్‌తో పాటు ఐశ్వర్య బోరా, దివ్య జ్యోతి, శ్లోకా, ప్రవీణ్, మోహన్ ఆర్య, జీవా బాలచందర్, ప్రియాంక సింగ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



ఒక స్లమ్‌లో ఉండే సాధారణ కుర్రాడి ప్రేమ ప్రయాణం, ఆ ప్రయాణంలో డబ్బున్న వ్యక్తుల వల్ల అతని జీవితంలో ఎదురయ్యే ఊహించని పరిణామాలు, ఈ క్రమంలో అతని ప్రేమ కథ ఎలాంటి మలుపులు తిరిగింది అనే ఆసక్తికరమైన పాయింట్‌తో 'ఛత్రి' సినిమాను రూపొందించారు. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సరోజ్ రా అండ్ రస్టిక్ లుక్‌లో, పూర్తిగా కొత్తగా కనిపిస్తున్నారు. స్లమ్ కుర్రాడి గెటప్‌లో ఉన్న ఆయన ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఉండటం సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ చిత్రానికి రమేష్ మర్రెపల్లి సినిమాటోగ్రఫీ అందించగా, నాని దేవరపల్లి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. సినిమాకి సంబంధించిన ఇతర వివరాలను చిత్ర యూనిట్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.

'రామాయణ' కలెక్షన్ల సునామీ!

నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన 'రామాయణ' ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తోంది. విడుదలైన రెండో రోజు వర్కింగ్ డే కావడంతో తొలి రోజుతో పోలిస్తే కొద్దిగా తగ్గుదల కనిపించినప్పటికీ, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 200 కోట్ల మార్క్‌ను విజయవంతంగా దాటింది. దీంతో వీకెండ్ ముగిసేసరికి రూ. 500 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రణ్‌బీర్ కపూర్, యష్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన 'రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' కేవలం రెండు రోజుల్లోనే ఈ ఘనత సాధించింది.

ఈ సినిమా శుక్రవారం నాడు రూ. 48.05 కోట్ల నెట్ వసూలు చేయగా, ఓవర్సీస్‌లో రూ. 35 కోట్లు రాబట్టింది. దీంతో తొలి రెండు రోజుల్లో దీని ప్రపంచవ్యాప్త గ్రాస్ కలెక్షన్లు రూ. 221.05 కోట్లకు చేరుకున్నాయి. 'పఠాన్', 'ఆర్ఆర్ఆర్', 'పుష్ప 2', 'జైలర్ 2', 'ధురంధర్ 2' వంటి చిత్రాల సరసన ఈ సినిమా కూడా రెండు రోజుల్లోనే రూ. 200 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రాల జాబితాలో చేరింది.

భారతీయ మార్కెట్లో ఈ చిత్రానికి ప్రధాన వసూళ్లు హిందీ వెర్షన్ నుంచే వస్తున్నాయి. కేవలం శుక్రవారం రోజే హిందీలో 19,859 షోల ద్వారా రూ. 35.50 కోట్ల నెట్ వసూలయ్యాయి. ఇక కన్నడ వెర్షన్ ద్వారా రూ. 5.15 కోట్లు, తెలుగులో రూ. 4.75 కోట్లు, తమిళంలో రూ. 1.50 కోట్లు, మలయాళంలో 446 షోల ద్వారా రూ. 1.15 కోట్లు రాబట్టింది. మొదటి రెండు రోజుల్లో 'రామాయణ: పార్ట్ 1' భారతదేశంలో రూ. 134.80 కోట్ల గ్రాస్ వసూలు చేయగా, నెట్ కలెక్షన్లు రూ. 112.90 కోట్లకు చేరాయి.

అంతర్జాతీయ మార్కెట్లపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టిన ఈ చిత్రానికి విదేశాల్లోనూ భారీ స్పందన లభిస్తోంది. కేవలం రెండు రోజుల్లోనే ఓవర్సీస్‌లో ఈ సినిమా రూ. 86.25 కోట్ల గ్రాస్ వసూలు చేయడం విశేషం. దీపావళికి ముందే సినిమా విడుదల కావడం వల్ల బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభావం చూపుతుందనే ఆందోళనలను ఈ చిత్రం పటాపంచలు చేసింది. పండుగ రోజుల్లో కుటుంబాలు పూజలు ముగించుకుని థియేటర్ల బాట పట్టే అవకాశం ఉండటంతో రాబోయే రోజుల్లో కలెక్షన్లు మరింత పుంజుకునే అవకాశం ఉంది.

నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్, యష్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, రవి దూబే లక్ష్మణుడిగా, యష్ రావణాసురుడిగా నటించారు. అలాగే లారా దత్తా, రకుల్ ప్రీత్ సింగ్, వివేక్ ఒబెరాయ్, కాజల్ అగర్వాల్, సౌరభ్ సచ్‌దేవా, అరుణ్ గోవిల్, అనుపమ్ ఖేర్, సన్నీ డియోల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం నవంబర్ 5న ఘనంగా విడుదలయింది.

